సాక్షి
విశాఖపట్నం
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024


ఆస్ట్రేలియా కాన్సులేట్ మానసిక ఆస్పత్రి సందర్శన 8లో


ఘనంగా రాధాష్టమి వేడుకలు 8లో


శ్రీ అశ్వ వాహన గణపతిగా సంపత్ వినాయగర్

న్యూస్‌రీల్

14న జాతీయ లోక్ అదాలత్



మహారాణిపేట : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో ఈనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891 – 2560414, 2575046 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. అలాగే vskpdlsa@yahoo.com, dlsa.vsp@gmail.com వెబ్‌సైట్ ద్వారా మండల న్యాయ సేవా సంఘాలను సంప్రదించవచ్చన్నారు.

2,556 లైసెన్సుల రద్దు

3,027 మందిపై కేసులు

గోపాలపట్నం: నగరంలో హెల్మెట్ల ధారణపై జరుగుతున్న స్పెషల్ డ్రైవ్‌లో ఈ నెల ఒకటో తేదీ నుంచి 6వ తేదీ వరకు 2,556 డ్రైవింగ్ లైసెన్సులు తాత్కాలికంగా రద్దు చేశామని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. అలాగే 3,027 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని, వాహనం నడిపేవారితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని తెలిపారు.

రేపు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 13న నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కార్యదర్శి ఎంవీడీ ఫణిరామ్ పేర్కొన్నారు. ఈ నెల 4న నిర్వహించాల్సిన సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని, తిరిగి శుక్రవారం ఉదయం 10 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.25.37 లక్షలు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థాన హుండీల లెక్కింపు బుధవారం చేపట్టారు. గత నెల 3 నుంచి ఈ నెల 11 వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. రూ.25 లక్షల 37 వేల 268 నగదు, 115.100 గ్రాముల బంగారం, 742 గ్రాముల వెండితో పాటు యూఎస్‌కి చెందిన 14 డాలర్లు, 27 సింగపూర్ డాలర్లు, ఖతార్‌కు చెందిన 10 రియాల్స్ వచ్చాయి. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, గ్రేడ్–1 కార్యనిర్వహణాధికారి, సూపర్‌వైజింగ్ ఆఫీసర్ కె.నీలిమ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు పాల్గొన్నారు.

డాక్‌యార్డులో ఏఆర్, వీఆర్ ల్యాబ్ ప్రారంభం


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ పెందార్కర్

విశాఖ సిటీ: నేవల్ డాక్‌యార్డులో అత్యాధునిక వర్చువల్ రియాలిటీ–ఆగ్మెంటెడ్ రియాలిటీ(ఏఆర్, వీఆర్) ల్యాబ్‌ను తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ బుధవారం ప్రారంభించారు. కొత్త పరికరాల ఇన్‌స్టాలేషన్‌ను వేగవంతం చేసేందుకు ఈ ల్యాబ్ దోహదపడనుంది. అలాగే పని నాణ్యత కూడా మెరుగుపడుతుందని ఈఎన్‌సీ చీఫ్ తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తి రాక రేపు

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకట జ్యోతిర్మయి ఈనెల 13న విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఉదయం 5.45 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్ చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకొని కొద్ది సేపు విశ్రాంతి తీసుకుంటారు. అక్కడ నుంచి సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వెళ్తారు. ఉదయం 10.30 గంటలకు ఏయూని సందర్శిస్తారు. అనంతరం అన్నవరం వెళ్తారు.

వీఎంఆర్‌డీఏ పరిధిలో అనధికార లేఅవుట్లు 184



ప్లానింగ్ విభాగం నిర్వాకంతో వెలిసిన అక్రమ లేఅవుట్లు
ఇప్పటికే చాలా లేఅవుట్లలో సగానికి పైగా విక్రయాలు

- అక్రమ లేఅవుట్లపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ దృష్టి
- వెంటనే జాబితా ప్రకటించాలని ఆదేశం
- విశాఖలో అనుమతులు లేకుండా 20 లేఅవుట్లు
- వాటన్నింటిలో రిజిస్ట్రేషన్లు నిలిపివేత

విశాఖ సిటీ : ఒకటి కాదు.. రెండు కాదు.. వీఎంఆర్‌డీఏ పరిధిలో ఏకంగా 184 అనధికార లేఅవుట్లు ఉన్నాయట. అవన్నీ ఇప్పుడు గుర్తించినవి కాదు. చాలా కాలం క్రితమే ప్రణాళిక విభాగం అధికారులు గుర్తించారు. కానీ ఇప్పటివరకు వాటి వివరాలను బహిర్గతం చేయలేదు. ఆ విషయం తెలియక అనేక మంది ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాలో ఉన్న అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేశారు. దీనిపై మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ అనధికార లేఅవుట్లకు చెక్ పెట్టాలని నిర్ణయించారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో మరికొన్ని అనధికార లేఅవుట్లను గుర్తించి అన్నింటి జాబితాను సిద్ధం చేశారు. వెంటనే ఆ వివరాలను ప్రకటించాలని, వాటి రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పటికే ఆ లేఅవుట్లలో కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

అంతా 'ప్రణాళిక' ప్రకారమే..

వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ విభాగంలో అంతా 'ప్రణాళిక' ప్రకారం వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. ముఖ్యంగా అనధికార లేఅవుట్ల విషయంలో అధికారుల వ్యవహార శైలి ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. నాలుగేళ్ల క్రితమే అనధికార లేఅవుట్లను గుర్తించి రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై అప్పట్లోనే అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. అక్రమంగా వెలసిన లేఅవుట్లను గుర్తించారు. అయితే వాటిని ఇప్పటి వరకు ప్రకటించలేదు. స్థల యజమానులు, డెవలపర్లపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ వ్యవహారంలో ప్రత్యేక 'ప్లానింగ్'తో చేతులు కలిపారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా వాటిపై ఇప్పటివరకు చూసీచూడనట్లు వదిలేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అక్రమ లేవుట్లు అన్న విషయం తెలియని కొంత మంది వాటిల్లో ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారు.

చర్యలకు సిద్ధం

ఈ అనధికార లేఅవుట్లపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సీరియస్ అయ్యారు. ఇప్పటివరకు వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. వెంటనే వాటి వివరాలను ప్రకటించాలని ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో సైతం పొందుపరిచారు. అలాగే స్థల యజమానులు, డెవలపర్లపై చర్యలకు సిద్ధమవుతున్నారు. ఈ లేఅవుట్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల ద్వారా లేఅవుట్లు వేసిన డెవలపర్లకు నోటీసులు జారీ చేస్తున్నారు.

ఇందులో ప్లాట్లు కొనుగోలు చేయవద్దు



అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేయడం చట్ట విరుద్ధం. ఈ ప్లాట్ల క్రయ విక్రయాలు నిలిపివేశాం. ఇందులో ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయరు. వీటిల్లో రోడ్లు, విద్యుత్, నీరు, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించరు. అనధికారికంగా లేఅవుట్లు వేసి అమ్మకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– కె.ఎస్.విశ్వనాథన్, వీఎంఆర్‌డీఏ, కమిషనర్

విశాఖలో ఆ మూడు మండలాల్లోనే..

నగరంలో మూడు మండలాల్లో అనధికార లేఅవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం మండలాల్లో 20 లేఅవుట్లలో 78.688 ఎకరాల్లో ప్లాట్లను విభజించారు. ఆనందపురంలో దబ్బంద, కుసులువాడ, గొట్టిపల్లి, పెద్దిపాలెం, వేములవలస, కోలవానిపాలెం, కణమాంలోను, భీమిలిలో బోడమెట్టపాలెం, తాళ్లవలస, మజ్జివలసలోను, పద్మనాభంలో ఏడు గ్రామాల్లో ఈ అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. వీఎంఆర్‌డీఏ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లుగా విభజించి గజం రూ.15 వేలు నుంచి రూ.22 వేలు వరకు విక్రయిస్తున్నారు.


లేఅవుట్లు

భారీగా ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాలో..

ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల్లో భారీగా అనధికార లేఅవుట్లు ఉన్నాయి. ఇందులో అనకాపల్లి జిల్లాలో కశింకోట మండలం బయ్యవరం గ్రామంలో సర్వే నెంబర్ 195/2లో 403 ఎకరాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌ను సిద్ధం చేయడం విశేషం. అదే జిల్లాలో సబ్బవరం మండలం ఆరిపాకలో 121/2లో 189.5 ఎకరాల్లో అనధికారికంగా లేఅవుట్ వేశారు. ఒక్క సబ్బవరం మండలంలోనే 42 అక్రమ లేఅవుట్లు ఉండడం గమనార్హం. అదే విధంగా పెందుర్తి, చోడవరం, నాతవరం, పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, పరవాడ, నక్కపల్లి, మునగపాక, అచ్యుతాపురం, కశింకోట మండలాల్లో కూడా ఈ లేఅవుట్లు ఉన్నాయి. వీటితో పాటు విజయనగరం జిల్లాలో భోగాపురంలో 47 ఎకరాల్లోను, కొత్తవలస, పూసపాటిరేగ, ఎస్.కోట, బొండపల్లి, గంట్యాడ, జామి, లక్కవరపుకోట, వేపాడ, విజయనగరం మండలాల్లో కూడా అనేక చోట్ల అనుమతులు లేకుండా లేఅవుట్లు సిద్ధం చేశారు.

15 ఎకరాలకు పైగా వేసిన అనధికార లేఅవుట్లు

మండలం	గ్రామం	విస్తీర్ణం
కశింకోట	బయ్యవరం	403
సబ్బవరం	ఆరిపాక	189.5
వేపాడ	వేపాడ	70.86
విజయనగరం	కణపాక అయ్యన్నపేట	62.20
భోగాపురం	భోగాపురం వెస్ట్	47
కొత్తవలస	ఉత్తరాపల్లె	35.91
బొండపల్లి	కనిమెరక	31.36
గంట్యాడ	రామవరం	27.04
పాయకరావుపేట	పాయకరావుపేట	27
కొత్తవలస	చీపురువలస	19.83
సబ్బవరం	బాటజంగాలపాలెం	18.91
సబ్బవరం	సబ్బవరం	17.79
కొత్తవలస	చింతలపాలెం	17.74
వేపాడ	వేపాడ	16.92
జామి	లక్ష్మీపురం	16.9
పరవాడ	పెదముషిడివాడ	16.8
విజయనగరం	కణపాక అయ్యన్నపేట	15.81

సర్పంచ్‌పై టీడీపీ నేత రాళ్ల దాడి

- తలకు తీవ్రగాయాలు
- బాధితుడికి అదీప్‌రాజ్ పరామర్శ

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారం సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నేత పిల్లల అప్పలనాయుడుపై స్థానిక టీడీపీ నాయకుడు దాడికి తెగబడ్డాడు. గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం గోశాలలో ఆవుకు పశుగ్రాసం వేస్తుండగా మంగళవారం సాయంత్రం రాళ్లతో దాడి చేశాడు. దాడిలో సర్పంచ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో సబ్బవరం పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స పొంది, పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మోపాడ అప్పారావుతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ పిన్నంటి రమణను కలిసి, దాడికి పాల్పడిన నిందితునిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో టీడీపీకి చెందిన నంబారు సన్యాసిరావు కావాలనే కక్షపూరితంగా రాళ్లతో దాడి చేసినట్లు సర్పంచ్ వెల్లడించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు బుధవారం బాధితుడి స్వగ్రామం వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా పోరాటం చేస్తామన్నారు. బాధితుడు అప్పలనాయుడు మాట్లాడుతూ ఇటీవల కూడా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తనయుడు, టీడీపీకి చెందిన పిల్లల అప్పలనాయుడు తన అనుచరులు సుమారు 20 మందితో కలిసి తనపై దాడికి తెగబడ్డారన్నారు. సర్పంచ్‌ను పరామర్శించినవారిలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మోపాడ అప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు కర్రి బాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, పార్టీ నాయకులు సబ్బవరపు నారాయణమూర్తి, కొటాన వెంకటరమణ, యర్రా శ్రీనివాసరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, మాజీ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, గవర రాజు, కోట్ని నాయుడు, మొగలిపురం ఉపసర్పంచ్ సిరపరపు వాసు, మోపాడ చందు తదితరులు ఉన్నారు.


సర్పంచ్ అప్పలనాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

30న డాక్ పెన్షన్ అదాలత్

మహారాణిపేట: విశాఖపట్నంలో ఆర్‌ఎంఎస్ డివిజనల్ స్థాయిలో 101వ డాక్/పెన్షన్ అదాలత్‌ను ఈ నెల 30న ఆర్‌ఎంఎస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆర్‌ఎంఎస్ సూపరింటెండెంట్ తెలిపారు. పెన్షన్ విషయాలకు సంబంధించి ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. ఆర్‌ఎంఎస్ డాక్/పెన్షన్ అదాలత్ అనే శీర్షికతో ఫిర్యాదులు పంపాలని సూచించారు. ఈ ఫిర్యాదులను ఈ నెల 23వ తేదీలోగా ఆర్‌ఎంఎస్–వి డివిజన్, విశాఖపట్నం –530017కు చేరేలా పంపాల్సిందిగా కోరారు.

భలే మంచి బదిలీ బేరం

- అన్ని శాఖల బదిలీల్లో జోరుగా పైరవీలు
- నచ్చిన స్థానం కోసం తహసీల్దార్లు, ఎంపీడీవోలు ప్రయత్నాలు
- సిఫార్సు లేఖల కోసం మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- పోస్టింగ్‌కు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు డిమాండ్

మహారాణిపేట : బదిలీల్లో సిఫార్సుల జాతర నడుస్తోంది. పోస్టింగ్‌ల కోసం పైరవీలు తారాస్థాయికి చేరాయి. సాధారణ బదిలీలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో నచ్చిన స్థానాలను దక్కించుకోవడానికి ఎవరికివారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలో అధికారులు కూటమి ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. నగరంలో తిష్టవేసిన వారు ఇక్కడి నుంచి వెళ్లకుండా ఉండేందుకు.. జోన్ పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారు నగరంలో పోస్టింగ్ దక్కించుకోవాలని పైరవీలు చేస్తున్నారు. కీలకమైన కొన్ని మండలాల్లో తహసీల్దార్ పోస్టింగ్‌కు ఎంత ఖర్చు చేయడానికైనా సిద్ధమవుతున్నట్లు రెవెన్యూ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. డిప్యూటీ తహసీల్దార్లు కూడా ఈసారి పోస్టింగ్‌ల కోసం విపరీతంగా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో కలెక్టరేట్‌లో కీలకంగా వ్యవహరించి.. ఒక ఉన్నతాధికారి ఆగ్రహానికి గురై తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లిపోయిన అధికారి ఇప్పుడు పెందుర్తి డిప్యూటీ తహసీల్దార్‌గా దాదాపుగా ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో భీమిలి నియోజకవర్గంలో తహసీల్దార్‌గా చేసిన అధికారి మళ్లీ అదే ప్రాంతంలో పోస్టింగ్ కోసం ఒక ప్రజాప్రతినిధి ద్వారా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇలా ఒకరిద్దరు కాదు.. ఆరుగురు తహసీల్దార్లు విశాఖలో కీలక స్థానాల కోసం పోటీ పడుతుండడం విశేషం. ఈ పోస్టింగ్‌ల కోసం స్థానాన్ని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ముట్టజెప్పేందుకు సిద్ధమవుతున్నారన్న చర్చ జరుగుతోంది. జిల్లా పరిషత్ సీఈవో పోస్టు కోసం ఏడుగురు సీనియర్ ఎంపీడీవోలు పైరవీలు చేస్తున్నారు. ఈ పోస్టుకు రూ.10 లక్షల వరకు బేరం పెట్టినట్లు సమాచారం. అలాగే నగర శివారు ఎంపీడీవో స్థానాలకు కూడా మంచి గిరాకీ పలుకుతోంది. జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఒక వైపు లేఖలు ఇస్తూ, మరో వైపు శాఖల ఉన్నతాధికారులకు రహస్యంగా జాబితాలను పంపుతున్నట్లు తెలిసింది.



పేరుకే నిబంధనలు

జిల్లాలోని 14 ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపడుతున్నారు. ఈ ఏడాది జూలై 31 నాటికి ఒకే దగ్గర ఐదేళ్లపాటు సర్వీసు పూర్తిచేసిన వారికి తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి పనిచేసిన వారికి, 40 శాతానికి మించి వైకల్యం గల ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. అక్కడ సిపార్సు లేఖ ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

జెడ్పీ సీఈవో పోస్టుకు తీవ్ర పోటీ

పంచాయతీరాజ్‌లో కీలకమైన జిల్లా పరిషత్ సీఈవో పోస్టు కోసం తీవ్రంగా పోటీ ఉంది. ఇక్కడ జెడ్పీ సీఈవో ఓ మంత్రి వద్ద ఓఎస్డీగా నియమితులయ్యారు. ఖాళీ అయిన ఈ పోస్టు కోసం సీనియర్ ఎంపీడీవోలు పైరవీలు చేస్తున్నారు. ఇందుకు రూ.10 లక్షల వరకు ముట్టజెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

రెవెన్యూలో 65 సిఫార్సు లేఖలు!

ఉమ్మడి విశాఖ జిల్లాలో రెవెన్యూ శాఖలో అన్ని క్యాడర్ పోస్టులకు సంబంధించి విశాఖ జిల్లా కలెక్టర్ బదిలీ చేయాల్సి ఉంది. దీంతో విశాఖ కలెక్టర్ కార్యాలయానికి 65 సిపార్సు లేఖలు వచ్చినట్టు సమాచారం. కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి ఈ లేఖలు వచ్చినట్టు తెలుస్తోంది. అలాగే వివిధ క్యాడర్ల ఉద్యోగుల నుంచి రిక్వెస్టు లేఖలు కూడా వచ్చాయి. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పనిచేస్తున్న 15 మందికి పైగా తహసీల్దార్లు విశాఖ జిల్లాలో పోస్టింగ్ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు.

జెడ్పీలో పైరవీలు ముమ్మరం

జిల్లా పరిషత్ పరిధిలోని పంచాయతీరాజ్‌లో ఉద్యోగాలకు పలువురు పోటీ పడుతున్నారు. ఎంపీడీవోలు, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీ కోసం పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. ఇప్పటివరకు మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి 130 సిఫార్సు లేఖలు జెడ్పీ కార్యాలయానికి అందినట్టు తెలిసింది. బదిలీలకు ఇంకా గడువు ఉండడంతో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పలు కీలకమైన ప్రాంతాల్లో ఎంపీడీవో పోస్టులకు మంచి గిరాకీ ఉంది.

రైలు ప్రయాణంలో ఫోన్లు జర భద్రం

- కిటికీలు, ఫుట్‌పాత్‌ల వద్ద ఫోన్‌లో మాట్లాడవద్దు
- ఫోన్ పోయినా, మరచిపోయినా రైల్వే పోలీసులకు తెలపండి
- డీఎస్పార్పీ మోహనరావు సూచన
- రైల్వే ప్రయాణికులు పోగొట్టుకున్న 108 ఫోన్ల రికవరీ

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) యాప్‌తో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను సులభంగా రికవరీ చేయవచ్చని డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్పార్పీ) మోహనరావు తెలిపారు. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు కూడా తమ ఫిర్యాదులను నమోదు చేయొచ్చని పేర్కొన్నారు. ఇటీవల రైల్వే స్టేషన్లలో, రైలు ప్రయాణాల్లో ప్రయాణికులు పోగొట్టుకున్న, మరచిపోయిన ఫోన్ల రికవరీకి సంబంధించి స్థానిక రైల్వే పోలీస్ స్టేషన్‌లో బుధవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. రైలు ప్రయాణాల్లో మొబైల్ ఫోన్ల విషయంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైల్వే స్టేషన్లలోని వెయిటింగ్ హాళ్లలో మొబైళ్లకు చార్జింగ్ పెట్టి, రైలు వచ్చిందన్న తొందర్లో ఫోన్లను మర్చిపోయి రైలెక్కేస్తుంటారని, రైలులో కూడా చార్జింగ్ పాయింట్లు ఉన్నందున, ప్లాట్‌ఫాంలపై చార్జింగ్ పెట్టవద్దని హితవుపలికారు. రైలు కిటికీల వద్ద, ఫుట్‌పాత్‌ల వద్ద నిలబడి ఫోన్‌లో మాట్లాడడం వలన దొంగలకు అవకాశం ఇచ్చినట్లవుతుందన్నారు. రైల్లో ప్రయాణించేటపుడు విలువైన వస్తువులు, డబ్బుల్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఏదైనా పోగొట్టుకుంటే వెంటనే రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పార్పీ మోహనరావు చిత్రంలో రికవరీ చేసిన ఫోన్లు


రికవరీ చేసిన ఫోన్లను యజమానులకు అందిస్తున్న జీఆర్పీ సిబ్బంది

రూ.18 లక్షల విలువైన 108 మొబైళ్ల రికవరీ

రైల్వే పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లపై సుమారు 350 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 68 మొబైళ్లను రికవరీ చేసి గతంలోనే వాటి యజమానులకు అందించామన్నారు. ప్రస్తుతం రూ.18 లక్షల విలువైన మరో 108 ఫోన్లను యజమానులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సీఈఐఆర్ యాప్ ద్వారా క్రైం టీం ఈ ఫోన్లను రికవరీ చేయగలిగినట్లు వెల్లడించారు.

ఆశ వదులుకున్నా..



నాలుగు నెలల క్రితం హైదరాబాద్ నుంచి విశాఖ వస్తూ నా ఐఫోన్‌ను రైల్లో మర్చిపోయాను. నేనైతే ఫోన్ మీద ఆశలు వదిలేశా. జీఆర్పీ సిబ్బంది సూచనలతో ఫిర్యాదు చేశా. వారు నా ఫోన్‌ను కనుగొని, నాకు ఫోన్ చేశారు. ఆనందంగా ఉంది.

– ఎస్.రాంగోపాల్, విశాఖపట్నం

నమ్మలేకపోతున్నా..



జూలై 23న విజయవాడ నుంచి విశాఖ వస్తూ.. నా మొబైల్‌ను పోగొట్టుకున్నాను. విశాఖ స్టేషన్లో దిగిన వెంటనే జీఆర్పీ వద్ద ఫిర్యాదు చేశాను. వారు విచారణ జరిపి, నా ఫోన్ దొరికిందని మంగళవారం నాకు ఫోన్ చేసి చెప్పారు. నిజంగా నమ్మలేకుండా ఉన్నాను.

– ప్రవంతి, విజయనగరం

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు సత్కారం

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా నియమితులైన రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ, రాష్ట్ర మత్స్యకార(వాడబలిజ, నెయ్యిల, జాలారి) విభాగం అధ్యక్షుడు పేర్ల విజయ్‌చందర్, రాష్ట్ర నగరాల అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, రాష్ట్ర శిష్టకరణ విభాగం అధ్యక్షుడు మహంతిలను పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యక్షులు అప్పన్న, అద్దెపల్లి రవి, కోరాడ అప్పలస్వామి నాయుడు, సకలాభక్తుల ప్రసాదరావు, శివరామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు ఎంపీ షరీఫ్, అనూష పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


వివిధ విభాగాల అధ్యక్షులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

నేడు స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3కు బ్లోడౌన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3ను బ్లోడౌన్ చేయాలని ఉక్కు యాజమాన్యం నిర్ణయించింది. కోకింగ్ కోల్ కొరత ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి యాజమాన్యం ఒక బృందంతో కూడిన ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో ఈ ఫర్నేస్ కొంత కాలం ఉత్పత్తికి దూరం కానుంది. స్టీల్‌ప్లాంట్‌లోని మూడు బ్లాస్ట్‌ఫర్నేసుల్లో రెండు వారాల నుంచి సింగిల్ ఫర్నేస్‌లో మాత్రమే ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కోకింగ్ కోల్ నిల్వలతో 45 రోజులపాటు సింగిల్ ఫర్నేస్ నడపాలని ఉక్కు మంత్రిత్వశాఖ నిర్దేశించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే బీఎఫ్–3కు కూలింగ్ ప్లేట్లు, షేప్ల సమస్యలు ఉండటంతో కొంతకాలంగా మరమ్మతులు చేయాలని యోచిస్తున్నారు. బ్లోడౌన్ ప్రక్రియలో భాగంగా ఫర్నేస్‌లో ఉన్న ఎయిర్‌ను పూర్తిగా తొలగిస్తారు. తద్వారా ఫర్నేస్ టెంపరేచర్ జీరో కానుంది. ఈ క్రమంలో గురువారం నుంచి బీఎఫ్–3ను నిలిపివేసి, మిగిలిన రెండింటిలో ఒక దానిలో ఉత్పత్తి కొనసాగించనున్నారు. బీఎఫ్–3ను దీర్ఘకాలం నిలిపివేస్తారా, మరమ్మతులు పూర్తయిన తర్వాత ఉత్పత్తిలోకి తెస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



ప్రజల కోసం.. దాశరథి జీవితం


మాట్లాడుతున్న అరసం తెలంగాణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్

విశాఖ సిటీ: ప్రజల కోసం కళా ప్రపూర్ణ దాశరథి కృష్ణమాచార్య తన జీవితాన్ని అంకితం చేశారని అరసం తెలంగాణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్ అన్నారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖ, అభ్యుదయ రచయితల సంఘం(అరసం) సంయుక్తంగా టీఎల్ఎన్ సభా హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన దాశరథి శత జయంతి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ నిజాంకి వ్యతిరేకంగా పోరాటం చేసిన దాశరథి శత జయంతి ఉత్సవ సభ విశాఖలో జరగడం గమనార్హమన్నారు. అరసం కార్యనిర్వాహక కార్యదర్శి జి.ఎస్.చలం మాట్లాడుతూ దాశరథి తన జీవితంలోని ముఖ్య ఘట్టాలను యాత్రా స్మృతి పేరుతో రాశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విశాలాంధ్ర జాతీయ దినపత్రిక సంపాదకుడు, ఆర్‌వీ రామారావుకు పురిపండా పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో ఏయూ తెలుగు శాఖ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, ప్రొఫెసర్లు వెలమల సిమ్మన్న, చందు సుబ్బారావు, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డి.వి.సూర్యరావు, ఎస్.ఎం.ఇక్బాల్, తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్రా అప్పారావు, జె.వి.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాల్లో తాగునీటి శుద్ధి యంత్రాలు



నీటి శుద్ధి ప్లాంట్ ప్రారంభోత్సవంలో విశాఖ ఎంపీ శ్రీభరత్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ పర్యాటక ప్రాంతాల్లో దివీస్ లేబొరేటరీస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆధునిక నీటి శుద్ధి యంత్రాలను విశాఖ ఎంపీ శ్రీభరత్ బుధవారం ప్రారంభించారు. ఒక్కో ప్లాంట్‌కు రూ.16.8 లక్షలు వెచ్చించి కై లాసగిరి, తెన్నేటి పార్కు, వుడా పార్కులలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దివీస్ ల్యాబ్స్ ఏర్పాటుచేసిన ప్లాంట్ల ద్వారా కేవలం స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే కాకుండా, ప్లాస్టిక్ నియంత్రణలో మరో ముందడుగు పడుతుందన్నారు. పార్కుల్లో కనీస సౌకర్యాల కల్పనలో మరింత సహకారం అందించాలని దివీస్ యాజమాన్యాన్ని సూచించారు. వీలైతే వీఎంఆర్‌డీఏ కోరిన విధంగా పర్యాటకులకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తాగునీటి శుద్ధి యంత్రాలను అందించిన దివీస్ ల్యాబ్స్ యాజమాన్యానికి మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దివీస్ ల్యాబ్స్ జనరల్ మేనేజర్ వై.ఎస్.కోటేశ్వరరావు, వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, డీఏఫ్‌వో శాంతిస్వరూప్, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివాని, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎస్‌వీఎస్ఎన్ రాజు, రామరాజు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో రైళ్లు గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: బచేలి-కిరండూల్ మధ్య కురుస్తున్న భారీ వర్షాలు, భద్రతా కారణాల దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటాయి.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్ స్పెషల్ రద్దు

నిర్వహణ కారణాల దృష్ట్యా తిరుపతి-శ్రీకాకుళం రోడ్-తిరుపతి మధ్య నడుస్తున్న స్పెషల్ రైళ్లు డిసెంబరు వరకు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. తిరుపతి-శ్రీకాకుళం రోడ్(07440) స్పెషల్ అక్టోబరు 6వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు, శ్రీకాకుళం రోడ్-తిరుపతి(07441) స్పెషల్ అక్టోబరు 7వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు రద్దు చేశారు.

‘హార్బర్’ గాలికి.. భూములు ‘వాణిజ్యా’నికి.!


పోర్టుకు ఇచ్చిన భూములివే..

- వీఎంఆర్‌డీఏ భూముల్లో వైజాగ్ పోర్టు సోకులు
- 16 ఏళ్ల క్రితం శాటిలైట్ పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ప్రతిపాదనలు
- భీమిలి మండలం మూలకుద్దులో 288.12 ఎకరాలు పోర్టుకిచ్చిన వీఎంఆర్‌డీఏ
- శాటిలైట్‌పోర్టు, హార్బర్ నిర్మాణం సాధ్యం కాదంటూ ఎయికామ్ సంస్థ స్పష్టం
- ఇప్పుడు ఆ భూములను వాణిజ్య, పర్యాటక ప్రాజెక్టుల కోసం వినియోగం!
- ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు పిలిచేసిన విశాఖపట్నం పోర్టు
- పోర్టు వ్యవహార శైలిపై వీఎంఆర్‌డీఏకి ఫిర్యాదు చేసిన సిటిజన్స్ ఫోరం

సాక్షి, విశాఖపట్నం : హార్బర్ పేరుతో అప్పనంగా భూములు తీసుకున్నారు. అది అక్కడ సాధ్యం కాదని తెలిసి.. తిరిగి భూములు ఇవ్వకుండా.. కొత్త ఎత్తుగడ వేశారు. శాటిలైట్ పోర్టూ లేదు.. హార్బర్ లేదు.. ‘కమర్షియల్ బిల్డింగ్ కట్టేద్దాం.. టూరిజం ప్రాజెక్టులు పెట్టేద్దాం’ అంటూ సిద్ధమైపోతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.300 కోట్లు విలువైన 288 ఎకరాల్ని నిబంధనలకు విరుద్ధంగా తమ ఖాతాలో జమచేసుకునేందుకు విశాఖపట్నం పోర్టు సమాయత్తమవుతోంది. ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయిన వీఎంఆర్‌డీఏ మాత్రం తమ భూములు తాము తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తోంది.

పోర్టులో రద్దీని తగ్గించేందుకు.. ప్రస్తుతం ఉన్న **హార్బర్‌ని శివారుకు తరలించేందుకు విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) నిర్ణయించింది. అదేవిధంగా మరో శాటిలైట్ పోర్టును నిర్మించి, కొన్ని కార్గో షిప్స్‌ని అటువైపు తరలించాలని భావించింది. ఇం**దులో భాగంగా శాటిలైట్ పోర్టు, హార్బర్ నిర్మించేందుకు స్థలం కావాలంటూ 2007లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి వీపీఏ దరఖాస్తు చేసుకుంది. దీనిని పరిశీలించి చర్యలు తీసుకోవాలంటూ వీఎంఆర్‌డీఏకు ప్రభుత్వం ఆదేశించింది. రెండింటికీ అనుకూలంగా ఉండేలా భీమిలి మండలం మూలకుద్దులో స్థలం ఉందనీ.. అది పోర్టుకి ఇచ్చేందుకు అనువైందని ప్రభుత్వానికి వీఎంఆర్‌డీఏ అధికారులు లేఖ రాశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం.. ఆ స్థలం పోర్టుకు బదలాయించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. 2008లో మూలకుద్దులో 288.12 ఎకరాల స్థలాన్ని పోర్టుకు కేటాయించారు. ఈ మేరకు ప్రభుత్వం ఈ భూమిని పోర్టుకు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్థలంలో శాటిలైట్ పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనీ.. మరే ఇతర అవసరాలకు ఉపయోగించకూడదని నిబంధనల్లో స్పష్టం చేసింది.

నో చెప్పిన ఎయికామ్ సంస్థ

భూ కేటాయింపులు జరిగిన తర్వాత శాటిలైట్ పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సంబంధించి సాధ్యాసాధ్యాలు, ప్రయోజనాలపై ఎయికామ్ సంస్థతో పోర్టు సర్వే నిర్వహించింది. ఈ భూముల్లో శాటిలైట్ పోర్టు నిర్మాణం సాధ్యం కాదని ఆ సంస్థ స్పష్టం చేసింది. అది టైడల్ ప్రాంతమని.. సహజ పర్యావరణం దెబ్బతింటుందని.. అక్కడ నేల శాటిలైట్ పోర్టుకు గానీ, హార్బర్ నిర్మాణానికి గానీ సరిపోదని సూచించింది. ప్రస్తుతం ఉన్న ఫిషింగ్ హార్బర్‌ను రూ.150 కోట్లతో ఆధునికీకరిస్తే చాలని నివేదికలో స్పష్టం చేసింది.

నిర్లక్ష్యంగా వీఎంఆర్‌డీఏ

ప్రస్తుతం మూలకుద్దులో ఎకరం భూమి విలువ సుమారు రూ.కోటి వరకూ ఉంది. అంటే సుమారు రూ.300 కోట్లు విలువైన వీఎంఆర్‌డీఏ భూమిని విశాఖపట్నం పోర్టు అప్పనంగా కొట్టేసేందుకు కుయుక్తులు పన్నుతోంది. ఈ విషయం తెలిసి కూడా వీఎంఆర్‌డీఏ అధికారులు మౌనం వహిస్తున్నారు. ఇప్పటికే నష్టాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న వీఎంఆర్‌డీఏకు.. ఈ భూములు తిరిగి దక్కితే ఎంతో ప్రయోజనం ఉంటుంది. కానీ.. అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

మడ అడవులు అభివృద్ధి చేయాలి..

సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న భూముల్ని వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు పోర్టు చేస్తున్న ప్రయత్నాలపై గ్రేటర్ విశాఖపట్నం సిటిజన్స్ ఫోరం మండిపడుతోంది. శాటిలైట్ పోర్టు నిర్మించనప్పుడు ఆ భూములు పోర్టు పరిధిలో ఉంచాల్సిన అవసరం లేదని ఫోరం సభ్యులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మడ అడవులు నిర్మించేందుకు ప్రయత్నించాలే తప్ప.. వాణిజ్య పరమైన ప్రాజెక్టులు నిర్మించేందుకు అనుమతులు ఇవ్వకూడదంటూ వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం ఆ భూములను పర్యావరణహితంగానే ఉంచాలని, ఆ భూముల కేటాయింపులు రద్దు చేసి వెనక్కు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లొదిన పోర్టు అధికారులు

ఎయికామ్ సంస్థ నివేదికతో పోర్టు పునరాలోచనలో పడింది. ఈ భూముల్ని కొన్నేళ్ల పాటు వదిలేసింది. ఎయికామ్ సంస్థ చెప్పినట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ప్రస్తుతం ఉన్న ఫిషింగ్ హార్బర్‌ను రూ.150 కోట్లతో ఆధునికీకరించే పనులకు పోర్టు శ్రీకారం చుట్టింది. శాటిలైట్ పోర్టు ఆలోచనను హోల్డ్‌లో పెట్టింది. తాజాగా ఆ భూముల్ని ఎలాగైనా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కొత్త ఎత్తుగడకు సిద్ధమైంది. మొత్తం 288.12 ఎకరాల్ని వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడానికి నిబంధనల్ని సైతం పోర్టు అధికారులు తుంగలో తొక్కుతున్నారు. ఈ భూముల్లో కమర్షియల్, టూరిజం ప్రాజెక్టులతో కూడిన మల్టీ యూజ్ ప్రాజెక్టు నిర్మాణానికి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) కోరుతూ టెండర్లు పిలిచింది. వాస్తవానికి ప్రభుత్వం భూమిని కేటాయించినప్పుడు శాటిలైట్ పోర్టు, హార్బర్ నిర్మించేందుకు మాత్రమే వినియోగించాలనీ.. ఇతర అవసరాలకు వాడకూడదని స్పష్టం చేసినా పోర్టు పట్టించుకోవడం లేదు. పీపీపీ పద్ధతిలో ఇక్కడ ప్రాజెక్టులు అభివృద్ధి చేసేందుకు ఈ ఏడాది మే నెల చివర్లో ఈవోఐ కోసం రావాలంటూ రియల్ ఎస్టేట్ డెవలపర్స్, లాజిస్టిక్స్ సర్వీస్ ప్రొవైడర్లు, రవాణా ఏజెన్సీలు, పీపీపీ ఆపరేటర్లను పోర్టు ఆహ్వానించింది.

ఘనంగా రాధాష్టమి వేడుకలు


రాధాకృష్ణులకు హారతి ఇస్తున్న దృశ్యం


కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో బుధవారం రాధాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున 4.30 గంటలకు మంగళ హారతి, 8 గంటలకు దర్శన హారతి, 9 నుంచి హరినామ సంకీర్తన, 11కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం రాధాకృష్ణులను వివిధ వర్ణాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాధాష్టమి విశిష్టతను రాధాకృష్ణుల లీలలపై ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ప్రత్యేక ప్రవచనాలు చేశారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చోరీ కేసు ఛేదన.. ఇద్దరి అరెస్టు

- మూడు కేసుల్లో 17 తులాల బంగారు వస్తువుల రికవరీ

పరవాడ: మండలంలోని సాలాపువానిపాలెంలో వంటాకు ఎరుకునాయుడు ఇంట్లో గత నెల 28న జరిగిన చోరీ కేసును పరవాడ పోలీసులు ఛేదించారు. ఈ కేసుతో పాటు అనకాపల్లి టౌన్, విజయనగరం ప్రాంతాల్లో జరిగిన రెండు కేసుల్లో నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. ఈ కేసుల్లో విశాఖపట్నం వన్‌టౌన్ ఏరియాకు చెందిన వడ్డాది పోలరాజు(45), భీమునిపట్నం చేపలుప్పాడకు చెందిన పాత నేరస్తుడు ఎల్లాజీ(32)లను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం సాలాపువానిపాలెం గ్రామానికి చెందిన ఎరుకునాయుడు హైవే పక్కన అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈయన పరవాడ ఫార్మాసిటీలోని ఓ పరిశ్రమలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 27న ఎ-షిఫ్టుకు వెళ్లాడు. తన బంధువు చనిపోవడంతో అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో విధుల నుంచి బంగారమ్మపాలెం వెళ్లి, రాత్రి 10.30కు ఇంటికిరాగా, తాళం పగులగొట్టి ఉండడం చూశాడు. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువా పగుల గొట్టి ఉంది. ఏడుంపావు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు దొంగిలించినట్లు గుర్తించి, పరవాడ పోలీసులకు మరుసటిరోజు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారంతో వడ్డాది పోలరాజు ఉరఫ్ భీమ, చినమన ఎల్లాజీలను అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి మూడు కేసులకు సంబంధించి 17 తులాల బంగారు వస్తువులను రికవరీ చేశారు. వీటి విలువ రూ.12 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ కేసులను ఛేదించిన పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.అప్పలనాయుడు, సీసీఎస్ ఎస్ఐ పి.రమేష్, పరవాడ ఏఎస్ఐ బీవై నాయుడు, కానిస్టేబుల్ జీవీవీఎస్ నాయుడు, సీసీఎస్ సిబ్బందిని అనకాపల్లి ఎస్పీ అభినందించారు.

సాయిరాం పార్లర్ సత్యనారాయణ ఇకలేరు


సత్యనారాయణ(ఫైల్)

సీతమ్మధార: నగరంలోని సాయిరాం పార్లర్ యజమాని తాలూరి సత్యనారాయణ(60) బుధవారం మరణించారు. ఆయనకు భార్య, కుమారు డు, కుమార్తె ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు దరి యలమంచిలికి చెందిన ఆయన 1986లో విశాఖ వచ్చి స్థిరపడ్డారు. చిరుద్యోగంలో చేరి అంచలంచెలుగా హోటల్ వ్యాపారంలో ఎదిగారు. గతంలో రాష్ట్ర హోటల్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడితోపాటు పలు హోదాల్లో పనిచేశారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మరో రెండు రోజుల్లో ఆయన పుట్టిన రోజని, ఇంతలో చనిపోవడంపై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు వాపోతున్నారు. ఆయన పార్థివదేహాన్ని సీతమ్మధార ఎస్ఆర్ఐ ఆస్పత్రి సమీపాన గల స్వగృహంలో ఉంచారు. విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, విశాఖ హోటల్స్ గౌరవాధ్యక్షుడు రహమాన్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మాజీ కార్పొరేటర్ రవిరాజు, కళా ఆస్పత్రి అధినేత రమణమూర్తి, విశాఖ హోటల్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వసంత కృష్ణ, రాష్ట్ర హోటల్స్ సంఘం కార్యదర్శి నాగరాజు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించారు. అంత్యక్రియలు కేఆర్ఎం కాలనీ శ్మశానంలో నిర్వహించారు.

మానసిక ఆస్పత్రిని సందర్శించిన ఆస్ట్రేలియా కాన్సులేట్

మహారాణిపేట: ప్రభుత్వ మానసిక వైద్యశాలను ఆస్ట్రేలియా కాన్సులేట్ ఓస్నాట్ ఓరెన్, కౌన్సిలర్ సైద్ ముకారం హుస్సైనీలు బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో ఉన్న మౌలిక సదుపాయాలు, చికిత్సా విధానాలను పరిశీలించారు. విదేశీయులకు మానసిక చికిత్స అవసరమైతే అవలంభించే విధానాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ రామిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

భీమిలి బీచ్‌లో నిర్మాణాల సంగతి తేల్చండి

- జీవీఎంసీ అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: భీమిలి బీచ్ సమీపంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల సంగతి తేల్చాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. భీమిలి బీచ్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ప్రహరీ గోడ నిర్మించారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా, నేహారెడ్డి తరఫు న్యాయవాది షణ్ముక్ వాదనలు వినిపిస్తూ, పిల్‌లో తమను ప్రతివాదిగా చేర్చలేదని తెలిపారు. తమ పరోక్షంలో తమకు తెలియకుండా ఉత్తర్వులు పొందారని వివరించారు. పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతామని చెప్పారు. అనంతరం ధర్మాసనం ప్రహరీ గోడ కూల్చివేత గురించి ఆరా తీసింది. ధర్మాసనం ఆదేశాల మేరకు ఆ గోడను కూల్చేశామని జీవీఎంసీ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి చెప్పారు. ఫోటోలను చూస్తే ఇంకా నిర్మాణాలున్నట్లు తెలుస్తోందని, వాటి సంగతి ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. నేహారెడ్డికి ఇప్పటికే నోటీసులు ఇచ్చి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించామన్నారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

ఢిల్లీకి చెందిన నలుగురు చైన్ స్నాచర్ల అరెస్ట్

- రెండున్నర తులాల మంగళసూత్రం, రెండు బైక్‌లు స్వాధీనం

సీతమ్మధార : నగరంలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఢిల్లీకి చెందిన నలుగురిని 4వ పట్టణ క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు. సీతంపేట ప్రాంతానికి చెందిన వానపల్లి మంగ(55) పోర్టు స్టేడియం ఈస్ట్ గేట్ ప్రాంతంలో ఓ ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తున్నారు. ఈ నెల 7న ఉదయం 6 గంటల సమయంలో ఇంటి నుంచి పనికి వెళ్తుండగా గురుద్వారా వద్ద ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వచ్చి, ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు మంగళ సూత్రం లాక్కుపోయారు. బాధితురాలు మంగ ఫిర్యాదు మేరకు 4వ పట్టణ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి, ఎస్ఐ కె.భాస్కరరావు నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాలు.

ఢిల్లీకి చెందిన నిందితులు సంజయ్ సాహాని(24), విజయ్(36), దీపక్ కుమార్(23), మహ్మద్ ఇస్తకర్(26) ఈ నెల 6న ఢిల్లీ నుంచి విశాఖ వచ్చారు. అదేరోజు రాత్రి ఒంటిగంట సమయంలో సూర్యాభాగ్ పోలీస్ కమిషనరేట్ ఎదురుగా ఒక బైక్ దొంగతనం చేశారు. ఆ బైక్‌పైనే తిరుగుతూ మరుసటి రోజు తెల్లవారుజామున మరో బైక్ దొంగిలించారు. ఓ బైక్‌పై ఇద్దరు గురుద్వారా వద్ద కాపు కాశారు. ఇంతలో మరో ఇద్దరు వెనుకనుంచి వచ్చి బాధితురాలు మంగ మెడలోని మంగళసూత్రాన్ని చైన్ స్నాచింగ్‌కి పాల్పడ్డారు. వీరు మొత్తం మూడు చోరీలు చేశారు. రైల్వేస్టేషన్ దరి బస్టాప్ వద్ద బుధవారం నిందితులను గుర్తించి, అరెస్టు చేశారు. వీరిపై ఢిల్లీలో కూడా చైన్ స్నాచింగ్, మొబైల్ దొంగతనాల కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి రెండున్నర తులాల బంగారు మంగళసూత్రం, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిని న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. స్వల్ప వ్యవధిలోనే కేసును ఛేదించి, నిందితులను అరెస్టు చేసిన పోలీసులను సీపీ శంఖబ్రత బాగ్చీ అభినందించారు.

తండ్రి పేరిట నగదు పురస్కారం

ఎంవీపీకాలనీ: విశాఖ మెంటల్ కేర్ ఆస్పత్రి పూర్వ పర్యవేక్షణాధికారి గుంటూరు భాగ్యారావు పేరిట అమెరికాలో స్థిరపడిన ఆయన కుమారుడు శశిధర్ క్యాష్ అవార్డు నిధిని ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మానసికశాస్త్ర విభాగం నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఈ అవార్డును అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు రూ.5 లక్షలను ఆస్పత్రి యాజమాన్యానికి శశిధర్ అందించారని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా ఏటా ప్రతిభ చూపిన విద్యార్థికి నగదు పురస్కారాన్ని అందిస్తామన్నారు.

శ్రీ అశ్వ వాహన గణపతిగా సంపత్ వినాయగర్

సీతమ్మధార: ఆశీలమెట్టలో గల శ్రీ సంపత్ వినాయగర్ స్వామి బుధవారం శ్రీ అశ్వ వాహన గణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయ దాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎస్ఎంసీ సీ ఫుడ్స్ యజమాని ఎస్.వెంకటేష్ అన్నప్రసాదం విరాళంగా అందజేశారు. సాయంత్రం శ్రీ షిరిడిసాయిబాబా భక్తిమండలిచే లలితా విష్ణు సహస్రనామం సామూహిక పారాయణం, భక్తి సకల సేవా సంఘంచే కోలాటం జరిగాయి.

భార్యను చంపిన భర్త అరెస్టు

పద్మనాభం: పద్మనాభం గ్రామంలో భార్యను పీక నులిమి చంపిన భర్తను సీఐ శ్రీధర్ బుధవారం అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన చిప్పిలి వెంకట లక్ష్మిని, భర్త చిప్పిలి భూలోక గత నెల 30న రాత్రి పీక నొక్కి చంపేశాడు. లక్ష్మి తరఫు బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. తాజాగా నిందితుడు పోలీసులకు చిక్కడంతో, అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

అగమ్యగోచరం నర్సుల భవితవ్యం


కేజీహెచ్‌లో ధర్నా చేస్తున్న నర్సులు

- శాశ్వత పద్ధతిలో నియామకాలు జరగాలి
- తక్షణమే జీవో నెం.115ను రద్దు చేయాలి
- కాంట్రాక్ట్ నర్సుల నిరసనకు రూపాకుల రవికుమార్ సంఘీభావం

మహారాణిపేట: తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ కాంట్రాక్ట్ నర్సులు కేజీహెచ్ క్లాక్ టవర్ వద్ద చేపట్టిన నిరసన బుధవారానికి ఆరో రోజుకు చేరుకుంది. ఈ నిరసనకు ఏపీ బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ సంఘీభావం తెలిపారు. నిరసనలో పాల్గొన్న వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 11,700 మంది నర్సుల భవితవ్యం జీవో నెం.115తో అగమ్యగోచరంగా మారిందన్నారు. వీరిని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నెం.115ను తక్షణమే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మౌలిక వసతుల కల్పన, మందుల సరఫరాలో విఫలమైన ప్రభుత్వం, ఇలాంటి సమయంలో జీవో నెం.115 తెచ్చి అనర్హులను రోగుల సేవలకు నియమించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఏఎన్ఎంకి జీఎన్ఎంగా శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్స్‌గా నియామకం చేయడం సరికాదన్నారు. కోవిడ్ కాలంలో పీపీఈ కిట్లు వేసుకుని రోగులకు సేవలందించిన నర్సుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ప్రభుత్వ పెద్దలు వెంటనే స్పందించి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే జీఎన్ఎంలను శాశ్వతోద్యోగులుగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బై.. బై.. గణేశా





బీచ్‌రోడ్డు: విఘ్నాలను తొలగించే గణనాథుడి విగ్రహాలు సముద్రుడి ఒడిలోకి చేరుతున్నాయి. వినాయక చవితి 5 రోజుల పూజ పూర్తయిన విగ్రహాలను నగర ప్రజలు సముద్రంలో నిమజ్జనం చేస్తున్నారు. ఇందుకు జీవీఎంసీ యంత్రాంగం కోస్టల్ బ్యాటరీ, పెదజాలారిపేట వద్ద ఏర్పాట్లు చేసింది. ఈ ప్రాంతాలకు నగరంలోని విగ్రహాలను భారీ ఊరేగింపుతో, జై గణేశా.. జైజై గణేశా, గణపతి బప్పా మోరియా అంటూ తీసుకొచ్చి, ఘనంగా నిమజ్జనం చేస్తున్నారు. నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.